క్లుప్తంగా

సెంట్రల్ డెల్టాకు నీటి విడుదల



సెంట్రల్ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేస్తున్న అధికారులు

ఆత్రేయపురం: కాలువలకు జలకళ వచ్చేసింది. ముందుగా ప్రకటించిన విధంగానే ఇరిగేషన్ ఏఈ పిల్లా సత్యనారాయణ, ఎల్ఎస్ సీహెచ్ బ్రహ్మాజీ రావులు సెంట్రల్ డెల్టా కాలువలకు నీరు విడుదల చేశారు. వేద పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు మోటార్ల స్విచ్ ఆన్ చేసి, కాటన్ బ్యారేజీ గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని కాలువలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. గోదావరికి పూజలు చేసి, నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు, పండ్లు సమర్పించి, హారతి ఇచ్చారు. నీటి విడుదలను క్రమేపీ పెంచుతామని వారు చెప్పారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



తాటిపాకలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: మారుమూల గ్రామాల్లో కూడా మెరుగైన వైద్య సేవలందించేందుకు వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. తాటిపాకలో రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటిపల్లి ఎస్తేరురాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం వైద్యం, వ్యవసాయం, విద్యా రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గ్రామ సచివాలయాల పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు, రైతుభరోసా కేంద్ర భవనాల నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి, ప్రజలకు సేవలందించేందుకు ఉద్యోగులను, వలంటీర్లను నియమించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, ఎంపీపీ కేతా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఒలుపు కార్మికుడికి సాయం



సూర్యారావుకు సాయం అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ, వలంటీర్లు

అంబాజీపేట: ఇసుకపూడి శివారు అంబేడ్కర్ నగర్‌లో అనారోగ్యంతో బాధ పడుతున్న ఒలుపు కార్మికుడు, ట్రాక్టర్ డ్రైవర్ నక్కా సూర్యారావుకు వలంటీర్ నెల్లి లక్ష్మణరావు ఆధ్వర్యాన గురువారం సాయం అందించారు. సూర్యారావు దుస్థితిని గమనించిన లక్ష్మణరావు వాట్సాప్‌లో మెసేజ్ పెట్టి ఫోన్ పే ద్వారా దాతల నుంచి నగదు సమకూర్చాడు. ఆ సొమ్ములతో 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలు, రూ.2 వేల నగదును సర్పంచ్ మోహన్‌సింగ్ బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, మార్కెట్ కమిటీ సభ్యుడు కోట విజయరాజు తదితరుల చేతుల మీదుగా సూర్యారావుకు వలంటీర్ అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ చైర్మన్ కాకర భీమరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. వలంటీర్ లక్ష్మణరావును, అతడికి సహకరించిన సహచర వలంటీర్లను, దాతలను వారు అభినందించారు.

ఘనంగా ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠాపనా మహోత్సవం

ఆత్రేయపురం: ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపనా మహోత్సవం గురువారం ఉదయం 8.31 గంటలకు ప్రారంభమయ్యాయి. వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యాన ఉదయం సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, జలాధివాసం, మధ్యాహ్నం మండపారాధన, అంకురార్పణ, ధ్వజారోహణ, క్షీరాధివాసం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. జెడ్పీటీసీ బోణం సాయిబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యాన సిబ్బంది పర్యవేక్షించారు. ఈ ఉత్సవాలు శనివారం వరకూ జరుగుతాయని తెలిపారు.

ప్రసాదరావు కుటుంబానికి పరామర్శ

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంలో మృతి చెందిన మాజీ సర్పంచ్, మాజీ సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి సుబ్రహ్మణ్య వరప్రసాదరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి గురువారం పరామర్శించారు. ప్రసాదరావు కుమారుడు కోటబాబును, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, మెట్ల రమణబాబు తదితరులు కూడా పరామర్శించిన వారిలో ఉన్నారు.

తొలి రోజే.. కానుక

- జగనన్న విద్యా కానుక పంపిణీకి పక్కాగా ఏర్పాట్లు
- స్టాకు పాయింట్లకు చేరిన పాఠ్య పుస్తకాలు, కిట్లు

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలల వివరాలు

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు
పి.గన్నవరం	290	19,377
కొత్తపేట	238	18,747
రాజోలు	229	14,529
మొత్తం	757	52,653



నగరం గ్రామంలోని స్టాక్ పాయింట్‌కు చేరిన పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లు

మామిడికుదురు: విద్యార్థుల భవిష్యత్తును మరింత ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభం కానున్నాయి. అదే రోజున విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించాలని నిర్ణయించింది. దీంతో పాటు అదే రోజున 'జగనన్న విద్యా కానుక' కిట్లు అందించే దిశగా చర్యలు తీసుకుంది. ఈ మేరకు పక్కాగా కార్యాచరణ చేపట్టింది. గతంలో పాఠ్య పుస్తకాలు ఆలస్యంగా రావడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఈ పరిస్థితికి పూర్తిగా చరమగీతం పాడారు. 'జగనన్న విద్యా కానుక' పేరుతో విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బ్యాగ్‌ల వంటివన్నీ ఉచితంగా అందిస్తున్నారు. పాఠశాలలు తెరచిన రోజునే విద్యా కానుకను విద్యార్థులకు అందించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ కార్యాచరణ చేపట్టారు. ఈ ఏడాది ప్రతి మండలంలోనూ ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, జగనన్న విద్యా కానుక కిట్లను ముందుగానే స్కూల్స్‌కు పంపించే ఏర్పాట్లు చేశారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో 757 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో 52,653 మంది చదువుకుంటున్నారు. పాఠశాలల పునఃప్రారంభం రోజునే వీరందరికీ జగనన్న విద్యా కానుక అందించనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

విద్యార్థులకు మేలు



విద్యార్థులకు మేలు చేసేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. మా పాప పెదపట్నం స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది. మూడేళ్ల నుంచి మా అమ్మాయి చదువుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్, వర్క్ బుక్స్, జగనన్న విద్యా కానుక కిట్లను ఉచితంగా అందిస్తున్నారు. తల్లిదండ్రులకు పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం వీటిని అందించడం అభినందనీయం.

– మంచెం పెద్దిరాజు, పెదపట్నం

విద్యకు సీఎం ప్రాధాన్యం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విద్యకు ఎనలేని ప్రాధాన్యం ఇస్తున్నారు. 'నాడు–నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చి వేశారు. ప్రైవేటు పాఠశాలలను తలదన్నే రీతితో ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దిన ఘనత జగన్ సర్కారుకే దక్కుతుంది. విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు హర్షణీయం.

– అరిగెల సూర్యనారాయణ, బి.దొడ్డవరం

ప్రభుత్వ చర్యలు అభినందనీయం



పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు కన్న కలలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోంది.

– కుసుమ ప్రసాద్, పీఎంసీ కమిటీ చైర్మన్, ఈదరాడ

మీరే.. సంక్షేమ సారథులు

- ఎమ్మెల్యేలు కొండేటి, రాపాక
- ఘనంగా 'వలంటీర్లకు వందనం'



పాశర్లపూడిలంకలో సత్కారం అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే చిట్టిబాబు



తాటిపాకలో సత్కరించిన వలంటీర్లతో ఎమ్మెల్యే రాపాక

మామిడికుదురు: వలంటీర్లు సంక్షేమ సారథులుగా నిలుస్తున్నారని పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పాశర్లపూడిలంకలో గురువారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వలంటీర్లకు పురస్కారాలు అందించి, సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే అందిస్తూ ప్రజలకు వలంటీర్లు భరోసా కల్పిస్తున్నారని అన్నారు. వారి సేవలు అజరామరమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ సభ్యురాలు చెరుకూరి పార్వతి, పీఏసీఎస్ చైర్మన్లు ముత్యాల నరసింహారావు, యూవీవీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ విప్పర్తి రమణ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాలం రమేష్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు వరం

రాజోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ వ్యవస్థ లబ్ధిదారులకు వరంగా నిలిచిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. తాటిపాకలో జరిగిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాటిపాక–1, 2 సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ఘనంగా సత్కరించారు. మండలంలో ఐదు సేవారత్న అవార్డులకు మూడు తాటిపాక వలంటీర్లకు రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అంకిత భావంతో సేవ చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. గతంలో ఏదైనా పని చేయాలన్నా, సంక్షేమ పథకాలు పొందాలన్నా బ్రోకర్ల వ్యవస్థ ఉండేదని, ఆ దుర్మార్గపు వ్యవస్థను కూల్చివేసి మెరుగైన, నిష్పాక్షపాత సేవలందించే వలంటీర్ వ్యవస్థను సీఎం తీసుకువచ్చారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఒకటో తేదీ తెల్లవారకుండానే పింఛను అందించిందా అని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేస్తున్న కృషి అభినందనీయమని రాపాక ప్రశంసించారు. కార్యక్రమంలో రాజోలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జీ, జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, ఎంపీపీ కేతా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, మండల పరిషత్ పరిపాలనాధికారి ఎం.సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్కవరంలో...

మలికిపురం: లక్కవరంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, అవార్డులు పొందిన వారిని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ సత్కరించారు. మండల జేఏసీ కన్వీనర్ చింతా రాజబాబు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొడవటి దొరబాబు పాల్గొన్నారు.

రూ.21.30 కోట్ల మేర 'రైతుభరోసా'



రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: పి.గన్నవరం నియోజకవర్గంలోని 28,356 మంది అన్నదాతల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతుభరోసా నిధులు రూ.21.30 కోట్లు గురువారం జమ చేశారు. ఈ సందర్భంగా అంబాజీపేట రైతుభరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి రైతుభరోసా నమూనా చెక్కును ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. పి.గన్నవరం మండలంలో 8,846 మందికి రూ.6.64 కోట్లు, అంబాజీపేటలో 5,163 మందికి రూ.3.88 కోట్లు, అయినవిల్లిలో 7,500 మందికి 5.63 కోట్లు, మామిడికుదురు మండలంలో 6,847 మంది రైతులకు రూ.5.13 కోట్ల మేర మంజూరయ్యాయని వివరించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని, గతంలో పంట పెట్టుబడికి రైతులు ధాన్యం కమీషన్‌దార్లు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చుకోవలసి వచ్చేదన్నారు. ప్రస్తుతం పంట పెట్టుబడికి సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సాయంతో రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందారని అన్నారు. వ్యవసాయ శాఖ పి.గన్నవరం సహాయ సంచాలకుడు ఎస్‌జేవీ రామ్మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, తహసీల్దార్ టి.మంగతాయారు, మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏఈఓ డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

లారీలకు కళ్లెం వేయాలి

- రోడ్లపై మట్టి తొలగించాలి
- పి.గన్నవరంలో వ్యాపారుల ఆందోళన
- మూడు గంటల పాటు లారీల నిలిపివేత



లారీలను నిలిపివేసి, ఆందోళన చేస్తున్న వ్యాపారులు

పి.గన్నవరం: రేసుగుర్రాల్లా దూసుకుపోతున్న ఇసుక, మట్టి లారీలకు కళ్లెం వేయాలని, రోడ్లపై పేరుకుపోయిన ఇసుకను తొలగించాలని డిమాండ్ చేస్తూ పి.గన్నవరంలో వ్యాపారులు గురువారం ఆందోళన నిర్వహించారు. మూడు రోడ్ల సెంటర్‌లో మూడు గంటల పాటు లారీలను నిలిపివేశారు. యర్రంశెట్టివారిపాలెం, పెదకందాలపాలెం ర్యాంపుల నుంచి అతి వేగంగా వెళ్తున్న లారీల నుంచి ఇసుక, మట్టి రోడ్లపై జారి పడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో రోడ్లపై మట్టి పేరుకుపోయి, ద్విచక్ర వాహనదారులు జారి పడి గాయాల పాలవుతున్నారని చెప్పారు. బ్రేకులు వేస్తే ట్రాక్టర్లు ఆగకుండా ముందుకు జారిపోతున్నాయని తెలిపారు. లారీలు వేగంగా వెళ్లడంతో దుమ్ము పైకి లేచి, షాపుల్లోని వస్తువులు పాడైపోతున్నాయని చెప్పారు. దుమ్ముతో అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్లపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్యాంకర్లతో రోడ్లపై నీళ్లు చల్లించాలని, లారీల వేగాన్ని నియంత్రించాలని నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో లారీ డ్రైవర్లకు ఎస్సై హరికోటిశాస్త్రి కౌన్సెలింగ్ ఇచ్చారు. లారీలు వేగంగా నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులతో ఎస్సై, సొసైటీ కమిటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్ చర్చలు జరిపారు. ర్యాంపు నిర్వాహకులతో మాట్లాడారు. రోడ్లపై మట్టిని తొలగించి, రోజూ నీళ్లతో తడిపేందుకు ర్యాంపు నిర్వాహకులు అంగీకరించడంతో వ్యాపారులు ఆందోళన విరమించారు. వర్తక సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు తెలగారెడ్డి అగ్ని సుబ్బారావు, దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్రి బాబూరావు, వర్తక సంఘ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు/రాజోలు/అయినవిల్లి: వైర్లపై చెట్ల కొమ్మల తొలగింపు, సబ్ స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

- నగరం విద్యుత్ సబ్ స్టేషన్ 33 కేవీ లైన్ పరిధిలోని పెదపట్నం, నగరం, మామిడికుదురు, అప్పనపల్లి, పాశర్లపూడిలంక, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, మొగలికుదురు గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.
- 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం రాజోలు సబ్‌స్టేషన్ పరిధిలోని రాజోలు పాత ఆంధ్రా బ్యాంకు వీధి నుంచి ఎల్ఐసీ కార్యాలయం వరకూ, తాటిపాక, బి.సావరం, కడలి, పాలగుమ్మి, వేగివారిపాలెం, గెద్దాడ గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- అయినవిల్లి సబ్ స్టేషన్ ముమ్మిడివరం ఫీడర్ పరిధిలో క్రాప, పోతుకుర్రు, శంకరాయగూడెం, కె.జగన్నాథపురం గ్రామాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ.. మాగాం, పోతుకుర్రు గ్రామాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

డయాలసిస్ పేషెంట్‌కు పింఛన్ పంపిణీ

రాజోలు: డయాలసిస్ రోగికి కొత్తగా మంజూరైన రూ.10 వేల పింఛనును రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి గురువారం పంపిణీ చేశారు. రాజోలుకు చెందిన గ్రంధి సుబ్బారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు డయాలసిస్ నిమిత్తం ప్రభుత్వం రూ.10 వేల పింఛను మంజూరు చేసిందని సర్పంచ్ తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

అయినవిల్లి: దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి రాజబాబు, హెల్త్ సూపర్‌వైజర్ పి.ప్రసాదరావు తెలిపారు. ఈ అంశంపై పీహెచ్‌సీ నుంచి విఘ్నేశ్వర స్వామి ఆలయం వరకూ గురువారం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజబాబు, ప్రసాదరావు మాట్లాడుతూ, దోమల నివారణతో మలేరియా తదితర జ్వరాలు రాకుండా కాపాడుకోవచ్చని అన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం కావాలి



శతాబ్ది కళాశాలలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

కొత్తపేట: డ్రగ్స్ రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ మద్దాల శ్రీనివాస్ అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణపై స్థానిక సిద్ధార్థ, శతాబ్ది కళాశాలల విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఒకసారి మత్తు పదార్థాలకు అలవాటు పడితే మానడం కష్టమని అన్నారు. ఆల్కహాల్, గంజాయి, స్టెరాయిడ్ వంటి మాదకద్రవ్యాలు మనిషి విచక్షణ కోల్పోయేలా చేస్తాయని, తద్వారా అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయని చెప్పారు. ఆ వ్యక్తితో పాటు ఆ కుటుంబం అవమానాల పాలవుతుందని, మాదకద్రవ్యాలకు ఆకర్షితులై జీవితాలను పాడు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్సై కె.అన్నవరం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రధానోపాధ్యాయుడు డి.జగదీప్ కుమార్ గురువారం తెలిపారు. విద్యార్థినులకు ఇంటర్మీడియెట్ విద్యను అందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో మహిళా జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసిందని అన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులున్నాయన్నారు. అన్ని సబ్జెక్టులకూ పూర్తి స్థాయిలో అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందన్నారు. ఫీజు లేని ఉచిత విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, వారంతపు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 98491 82099, 98490 39075, 98665 96353 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పావంచా పునర్నిర్మించాలి

అయినవిల్లి: పంట కాలువకు ఆనుకుని శిథిలమైన పావంచాను పునర్నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్యకు స్థానిక మన్నా ఫిషర్‌మెన్ కాలనీ వాసులు గురువారం వినతిపత్రం అందజేశారు.

టెన్త్ సప్లిమెంటరీ రాయనున్న 231 మంది

అంబాజీపేట: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. మండలంలో 231 మంది ఈ పరీక్షలు రాయనున్నారు. గత ఏడాది వరకూ సప్లిమెంటరీ పరీక్షలు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించేవారు. ఈ ఏడాది ఈ పరీక్షలు అమలాపురంలోని ప్రభుత్వ, కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతాయని ఎంఈఓ జేవీ కనకదుర్గ తెలిపారు.

నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం సుభిక్షం

మామిడికుదురు: నాలుగేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పాశర్లపూడిలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే జగన్‌కు ప్రజలు అండగా నిలిచి, వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూముల విలువ పెంపు

అంబాజీపేట: భూముల విలువ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలకు భూసేకరణ జరిగే ప్రాంతాల్లో మాత్రం మినహాయింపు ఇచ్చింది. కొత్త ధరలు గురువారం అమలులోకి వచ్చాయి. అంబాజీపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని సుమారు 40 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల్లో ఎకరం పొలం ప్రస్తుత ధరలను బట్టి 30 నుంచి 80 శాతం వరకూ భూముల విలువ పెంచారని సబ్ రిజిస్ట్రార్ పి.శారద తెలిపారు.

తప్పిన పెనుప్రమాదం



మాచవరంలో రోడ్డుపై పడిన భారీ చెట్టు కొమ్మ

అంబాజీపేట: మాచవరం – అంబాజీపేట ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన ఉన్న ఒక చెట్టు కొమ్మ గురువారం రాత్రి ఒక్కసారిగా విరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పగటి వేళ ఈ కొమ్మ విరిగి పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి ఈ సంఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.


క్రికెట్ విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతి అందిస్తున్న విప్ జగ్గిరెడ్డి, కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్యే కొండేటి

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చిన్నం తేజారెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా ట్రోఫీ, రూ.50 వేల నగదు, ద్వితీయ బహుమతిగా ట్రోఫీ, రూ.30 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిరికల్ వీడియో విడుదల



లిరికల్ వీడియో విడుదల చేస్తున్న సంగీత దర్శకుడు సింధు కె.ప్రసాద్

సఖినేటిపల్లి: 'పల్లె గూటికి పండగ వచ్చింది' సినిమాకు చెందిన రెండు పాటల లిరికల్ వీడియోను సఖినేటిపల్లిలో మ్యూజిక్ డైరెక్టర్ సింధు కె.ప్రసాద్ గురువారం విడుదల చేశారు. వీవీ మెరకకు చెందిన కవి, రచయిత కత్తిమండ ప్రతాప్ ఈ రెండు పాటలు రాశారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా ఈ నెల చివరి వారంలో విడుదల కానున్నదని ప్రసాద్ చెప్పారు. పల్లెల్లో యువతరం పాత్రపై, జాతరపై రెండు పాటలు రాశానని ప్రతాప్ తెలిపారు. గతంలో తమ ఇద్దరి కాంబినేషన్‌లో దశ పాటలు రూపొందించామని ప్రతాప్ తెలిపారు.